
సాక్షి
పల్నాడు
సోమవారం । 25 । డిసెంబర్ । 2023



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: సాగర్ నీటిమట్టం ఆదివారం 522.80 అడుగుల వద్ద ఉంది. ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి 7.742, ఎస్ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.



రూ.రెండు లక్షల విరాళం

తాడేపల్లిరూరల్: కె.కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి విజయవాడకు చెందిన వి.సుబ్బారెడ్డి, సుబ్బలక్ష్మి దంపతులు రూ.2 లక్షలు విరాళం అందజేశారు.

బండ్లమ్మ అమ్మవారికి పూజలు



చందోలు(పిట్టలవానిపాలెం): చందోలులోని బగళాముఖి బండ్లమ్మ అమ్మవారి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని మహాదేవిగా అలంకరించి అభిషేకాలు జరిపించారు.

న్యూస్‌రీల్

జగనన్నకు చెబుదాం రద్దు

నరసరావుపేట: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం (స్పందన) రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ తెలిపారు. క్రిస్మస్ పండగను పురస్కరించుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలు గమనించాలని కోరారు.

ఎస్పీ కార్యాలయంలో..

నరసరావుపేట: క్రిస్మస్ సందర్భంగా సోమవారం సెలవు దినం కావటంతో జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించే జగనన్నకు చెబుదాం(స్పందన) రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దీనిని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

ముగిసిన బాలోత్సవం



నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లాస్థాయి బాలోత్సవం ఆదివారం ముగిసింది. పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల ఆవరణలో రెండురోజుల పాటు నిర్వహించిన బాలోత్సవంలో దాదాపు 300 మంది చిన్నారులు సాంస్కృతిక, విద్యా, వైజ్ఞానిక పోటీలలో పాల్గొని సృజనాత్మకతను చాటారు. నిర్వాహకులు విజేతలకు ఎప్పటికప్పుడు బహుమతులను అందచేసి చిన్నారులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు. చిన్నారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

కోటప్పకొండలో ఆరుద్రోత్సవం రేపు

నరసరావుపేట రూరల్: కోటప్పకొండ శ్రీత్రికోటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం రాత్రి ఆరుద్రోత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ జి.శ్రీనివాసరెడ్డి ఆదివారం తెలిపారు. ఈ సందర్భంగా జ్యోతి దర్శనంతో పాటు స్వామి వారికి మహన్యాసక పూర్వక మహారుద్రాభిషేకం జరుగుతుందని తెలిపారు. అనంతరం స్వామి వారికి విశేష అలంకరణలు జరుగుతాయని వివరించారు. 27వ తేదీ ఉదయం యాగశాలలో రుద్ర హోమం జరుగుతుందని చెప్పారు. దక్షిణామూర్తి మాల విరమణ చేసే స్వాములకు, భక్తులకు ఆలయ ప్రాంగణంలో దాతల సహకారంతో అన్నసంతర్పణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

రేపు అండర్-14 జిల్లా బాలుర జట్టు ఎంపిక

గుంటూరు వెస్ట్(క్రీడలు): గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం అండర్-14 జిల్లా బాలుర జట్టు ఎంపిక నిర్వహించనున్నట్లు కార్యదర్శి దాసరి రమేష్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటలకు స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానంలో నిర్వహించే ఎంపికలకు సొంత కిట్ బ్యాగ్స్‌తోపాటు డిజిటలైజ్డ్ డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఆధార్ కార్డు తీసుకురావాలని కోరారు.

నేడు పోలీస్ స్పందన రద్దు

నగరంపాలెం: క్రిస్మస్ సందర్భంగా గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో సోమవారం నిర్వహించాల్సిన జగనన్నకు చెబుదాం(స్పందన)ను తాత్కాలికంగా రద్దు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు గమనించాలని ఆయన కోరారు.

మార్కెట్ కమిటీల్లో పన్ను వసూళ్లు మెరుగు

మార్కెటింగ్‌శాఖ ఏడీ రాజబాబు

కొరిటెపాడు(గుంటూరు): మార్కెట్ కమిటీల్లో పన్ను వసూళ్లు ఆశాజనకంగా ఉన్నట్లు మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు బి.రాజబాబు తెలిపారు. ఆదివారం ఆయన 'సాక్షి'తో మాట్లాడారు. గుంటూరు జిల్లాలోని 8 మార్కెట్ కమిటీలకు ఈ ఏడాది(2023-24) రూ.119.95 కోట్లు లక్ష్యం కాగా అందులో రూ.88.60 కోట్లు వసూలైందన్నారు. గతేడాది మొదటి ఎనిమిది నెలల కాలంలో రూ.77.18 కోట్లు వసూలు కాగా, ఈసారి రూ.11.41 కోట్లు పెరిగిందన్నారు. ఈ లెక్కన ఈ ఏడాది కూడా వంద శాతానికి మించి వసూళ్లు జరిగేలా విజిలెన్స్ చర్యలు మరింత పటిష్టం చేస్తామన్నారు. మొత్తం మీద చూస్తే.. ప్రస్తుతం పన్ను వసూళ్లలో గుంటూరు మార్కెట్ యార్డు రూ.72.86 కోట్లుతో ప్రథమ స్థానంలో ఉందని తెలిపారు. ఆ తర్వాత స్థానాల్లో పొన్నూరు రూ.4.12 కోట్లు, తెనాలి రూ.4.10 కోట్లు, ప్రత్తిపాడు రూ.2.43 కోట్లు, దుగ్గిరాల రూ.1.73 కోట్లు, మంగళగిరి రూ.1.50 కోట్లు, ఫిరంగిపురం రూ.0.94 కోట్లు, తాడికొండ మార్కెట్ యార్డు రూ.0.93 కోట్లు వసూలు చేసినట్లు వెల్లడించారు.

ప్రగతిబాట మనది

- కృష్ణానదిపై వంతెన నిర్మాణానికి టెండర్లు
- ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల మధ్య రాకపోకలు మెరుగుకు అవకాశం
- వాణిజ్యపరంగానూ పురోగతి
- పర్యాటక, పుణ్యక్షేత్రంగానూ దినదిన ప్రవర్ధమానం



పల్నాడు జిల్లా మాదిపాడు నుంచి ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వరకు కృష్ణానదిపై నిర్మించబోయే వంతెన ప్రాంతం

అచ్చంపేట: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల ప్రజల శతాబ్దాల కల నెరవేరబోతుంది. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలంలోని చిట్టచివరి గ్రామమైన మాదిపాడు వద్దగల కృష్ణానది మీదుగా ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం, ముక్త్యాల గ్రామం వరకు రెండు జిల్లాలను కలుపుతూ వంతెన నిర్మాణానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, రహదారులు, భవనాలశాఖ ఈ నెల 4న టెండర్లు పిలిచాయి. టెండర్లకు తుది గడువు జనవరి 12, 2024గా నిర్ణయించారు. ఎన్నికలలోపే పనులు ప్రారంభించే యోచనలో ప్రభుత్వం ఉన్నట్లుగా తెలుస్తోంది. మాదిపాడు నుంచి ముక్త్యాల వరకు కృష్ణానదిపై 600 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పున వంతెన నిర్మాణానికి ఈ ఏడాది జూన్ 12న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శిలాఫలకాన్ని ఆవిష్కరించిన విషయం తెలిసిందే.

చారిత్రకంగానూ ప్రాశస్త్యం

18వ శతాబ్దంలో రాజావాసిరెడ్డి వెంకటాద్రినాయుడు అచ్చంపేట మండలంలోని చింతపల్లిని కేంద్రంగా చేసుకుని ఈ ప్రాంతాన్ని పాలించారు. అప్పటి నుంచి కృష్ణానదిపై వంతెన నిర్మించాలన్న ప్రతిపాదనలు ఉన్నాయి. కానీ ఈనాటి వరకు ఆచరణకు నోచుకోలేదు. ఇన్నాళ్లకు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు చొరవ, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఈ ప్రాంత వాసుల కల సాకారం కాబోతుంది.

వంతెన నిర్మాణం ఇలా..

రెండు జిల్లాలను కలుపుతూ కృష్ణానదిపై నిర్మించబోయే వంతెనకు 13.35 ఎకరాల భూమిని సేకరించారు. పల్నాడు జిల్లా మాదిపాడు వైపు 4.45 ఎకరాలు, ఎన్టీఆర్ జిల్లా ముక్త్యాల వైపు 9 ఎకరాల భూమిని సేకరించారు. బ్రిడ్జి పొడవు 600 మీటర్లు కాగా, వెడల్పు 12 మీటర్లు. ముక్త్యాలవైపు కిలోమీటరు, మాదిపాడు వైపు అర కిలోమీటరు రోడ్డు వేయనున్నారు. ఇందుకుగాను రూ.60.50 కోట్లు నాబార్డు నిధులు మంజూరు చేయించారు. కృష్ణా నదిపై 14 పిల్లర్లతో వంతెన నిర్మాణం జరగనుంది.

పర్యాటకంగా మాదిపాడుకు వరం

బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మాదిపాడు పర్యాటక కేంద్రంగా మారనుంది. ఇక్కడకు 6 కిలోమీటర్ల దూరంలోనే పులిచింతల ప్రాజెక్టు, అక్కడే కృష్ణానది ఉత్తరదిశగా ప్రవహించే ప్రాంతం పవిత్ర ఉత్తర వాహిని, నిత్యం వేదమంత్రాలతో వేదఘోష ప్రతిధ్వనించే వేద వేదాంత మహావిశ్వవిద్యాలయం, 500 కిలోల పంచ లోహాలతో తయారు చేసిన, భారతీతీర్థస్వామితో ప్రతిష్ఠించిన సరస్వతీమాత ఆలయం, బంగారు నదులతో కూడిన నందులరేవు, బృగుమహర్షి ప్రతిష్ఠించిన శివాలయం, అడవిప్రాంతంలోని సత్తెమ్మతల్లి ఆలయం, అష్టముఖ గండభేరుండ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, కృష్ణానదికి అవలివైపున కోటి లింగాల మహాపుణ్యక్షేత్రం, వేదాద్రి లక్ష్మీనరసింహ్మ స్వామి ఆలయం ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆధ్యాత్మికంగానూ, పర్యాటకంగానూ ఈ ప్రాంత అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది.

వాణిజ్యపరంగానూ మేలే

బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే రెండు జిల్లాల మధ్య రాకపోకలకు మార్గం సుగమమవుతుంది. వ్యాపార లావాదేవీలు మెరుగవుతాయి. హేమాంద్రి, విష్ణు, కేసీపీ తదితర సిమెంట్ ఫ్యాక్టరీలు మొత్తం ఎన్టీఆర్ జిల్లాలోనే ఉన్నాయి. అక్కడి నుంచి పల్నాడు జిల్లాకు సిమెంట్ దిగుమతి కావాలంటే విజయవాడ, గుంటూరు పట్టణాల మీదుగా సుమారు 150 నుంచి 200 కిలోమీటర్లకుపైగా దూరం ప్రయాణించాల్సి ఉంది. అదే వంతెన నిర్మాణం పూర్తయితే కేవలం 50 కిలోమీటర్ల లోపు మాత్రమే దూరం ఉంటుంది. ఫలితంగా ఇక్కడ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు ఆస్కారం ఉంటుంది. మాదిపాడు, దాని పరిధిలోని గిరిజన తండాల నుంచి ఏ చిన్న అవసరం వచ్చినా అచ్చంపేటకు రావాలంటే 30 కిలోమీటర్లకుపైగా దూరం ఉంది. వంతెన పూర్తయితే జగ్గయ్యపేట కేవలం పది కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. ఇక్కడ మెరుగైన వైద్య సదుపాయాలు ఉన్నాయి. ఈ ప్రాంతం నుంచి హైదరాబాద్ వెళ్లాలన్నా సుమారు 60 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది.

పడవ ప్రమాదాలకు చెక్

ప్రస్తుతం రెండు జిల్లాల ప్రయాణికులు మర పడవలను ఆశ్రయిస్తున్నారు. పడవలలో ఎక్కువమందిని ఎక్కించుకోవడం, ప్రయాణికులతోపాటు ద్విచక్రవాహనాలు, పశువులను, జీవాలను తరలించడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలని తెలిసినా ప్రయాణించడం తప్పడంలేదని ఈ ప్రాంత గ్రామాల ప్రజలు అంటున్నారు. రాత్రి సమయాలలో అయితే అత్యవసర పరిస్థితులలో చేపల పడవలలో వెళ్లి వస్తున్నారు. బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే పడవలపై రాకపోకలు పూర్తిగా తగ్గిపోతాయి.

• క్రీస్తు జననం.. క్రిస్మస్ పర్వదినం

"లోక రక్షకుడి జననం.. సర్వమానవ పాప హరణం. బెత్లెహేము గ్రామంలో పశువుల పాకలో బాల ఏసు పుట్టుక.. ప్రపంచానికి వెలుగులు పంచెనిక. దూత శుభ వర్తమానంతో క్రీస్తును దర్శించిరి గొర్రెల కాపరులు.. ఆకాశాన తార చూపిన తోవలో రక్షకుని కనుగొని పూజించిరి జ్ఞానులు. ఏసు జననం సర్వలోకానికి శుభ దినం కాగా.. క్రీస్తు ఆరాధనం క్రిస్మస్ పర్వదినమై సంతోషాలు పంచింది." క్రిస్మస్ వేడుకలకు ఉమ్మడి గుంటూరు జిల్లా సిద్ధమైంది. చర్చిలన్నీ విద్యుత్ కాంతులు విరజిమ్ముతూ ప్రత్యేక ప్రార్థనలకు సిద్ధమయ్యాయి.

- సత్తెనపల్లి



సత్తెనపల్లిలోని ఆర్‌సీఎం చర్చి



ఆడుదాం ఆంధ్రా ఐకమత్యానికి ప్రతీక

గుంటూరులో 2 కి.మీ. వాక్‌థాన్‌కు విశేష స్పందన

- గుంటూరు జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి
- భారీగా హాజరైన యువకులు, క్రీడాకారులు
- పోలీస్ పరేడ్ గ్రౌండ్ నుంచి మార్కెట్ సెంటర్ వరకు వాక్‌థాన్

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు



మైదానంలో ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి విడదల రజిని, శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే ముస్తఫా, మేయర్ కావటి, మాజీ ఎమ్మెల్సీ డొక్కా తదితరులు

రేపు గుంటూరులో 'ఆడుదాం – ఆంధ్రా' పోటీలను ప్రారంభించనున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

నెహ్రూ నగర్: ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరులో ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాట్లను రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, శాసన మండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారి, ఎమ్మెల్యే ముస్తఫా, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్ ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, ఒక వైపు ప్రజల ఆరోగ్యంతో పాటు, ప్రతిభను గుర్తించటానికి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. గ్రామ స్థాయి నుంచి ప్రభుత్వమే పూర్తి ఖర్చు భరిస్తూ 2024 ఫిబ్రవరి 10వ తేదీ వరకు రాష్ట్ర స్థాయి వరకు పోటీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో ఇప్పటికే ఆడుదాం ఆంధ్రా క్రీడలకు 1,25,000 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు.

శాసనమండలి విప్ లేళ్ల అప్పిరెడ్డి మాట్లాడుతూ ప్రజల హృదయాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి స్థిరమైన స్థానం ఉందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకే పట్టం కట్టబోతున్నారని పేర్కొన్నారు. రాజకీయ పార్టీలన్నీ కలసి వచ్చి పోరాటం చేసినా వైఎస్ జగన్‌ను ఓడించే సత్తా లేదని విమర్శించారు. జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి క్రీడలను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం అన్ని గ్రామ, వార్డు స్థాయిలో పోటీలను ప్రారంభించటం జరుగుతుందన్నారు. రాష్ట్ర స్థాయిలో క్రికెట్ విజేతలకు రూ.5 లక్షల బహుమతి ఇవ్వనున్నట్లు తెలిపారు. తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ ముస్తఫా, నగరపాలక సంస్థ మేయర్ కావటి శివనాగ మనోహర నాయుడు, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ మాట్లాడారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డెప్యూటీ మేయర్లు బాల వజ్ర బాబు, సజీల, డీసీసీబీ చైర్మన్ ఆర్.సీతా రామాంజనేయులు, గుంటూరు పశ్చిమ మండల తహసీల్దార్ సాంబశివ రావు పాల్గొన్నారు.

సీఎం పర్యటన ఇలా...

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం ఉదయం 9.55 గంటలకు క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి తాడేపల్లి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.

- అక్కడి నుంచి 10.05 బయలుదేరి నల్లపాడు పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు 10-20కు చేరుకుంటారు. అక్కడ 10 నిమిషాలు ప్రజా ప్రతినిధులతో మాట్లాడతారు.
- అక్కడి నుంచి బయలుదేరి 10.35కు లయోలా పబ్లిక్ స్కూల్‌కు చేరుకుంటారు. అక్కడ ట్రోఫీలను, సర్టిఫికెట్లను పరిశీలించనున్నారు. శాప్(స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్) జెండా, జాతీయ జెండా ఎగురవేస్తారు.
- 10.50 నుంచి 11.10 వరకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి సంబంధించిన సందేశం ఇస్తారు. దీంతోపాటు క్రీడా పరికరాలను బహూకరించనున్నారు.
- 11.25 నుంచి 11.50 వరకు ఖోఖో, క్రికెట్, కబడ్డీ, బ్యాడ్మింటన్, వాలీబాల్ క్రీడాకారులతో పరిచయ కార్యక్రమంలో పాల్గొంటారు.
- 11-55కు నల్లపాడు పాలిటెక్నిక్ హెలిప్యాడ్ వద్దకు చేరుకుని అక్కడి నుంచి 12-15 తాడేపల్లి హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు.
- 12-25 నిమిషాలకు ముఖ్యమంత్రి నివాసానికి చేరుకోవడంతో పర్యటన ముగుస్తుంది.

టీనా చౌదరికి బంగారు నంది అవార్డు

తెనాలి: హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జీసీఎస్ వల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ బంగారు నంది అవార్డు-2023 ప్రదానోత్సవం ఆదివారం నిర్వహించారు. శాస్త్రీయ నృత్యం విభాగంలో తెనాలికి చెందిన కూచిపూడి నర్తకి మన్నే టీనాచౌదరిని బంగారు నంది పురస్కారంతో సత్కరించారు. ఇంజినీరింగ్ విద్య అభ్యసిస్తున్న ఆమె, పలు నృత్య వేదికలపై రాణించటమే కాకుండా, వర్ధమాన నటిగానూ గుర్తింపు పొందారు. 'పండుగాడి ఫొటో స్టూడియో' సినిమాలో సెకండ్ హీరోయిన్‌గా నటించారు. మా-ఏపీలోనూ సభ్యురాలిగా ఉన్నారు. టీనా తల్లిదండ్రులు మన్నే సత్యనారాయణ, శివకుమారి అధ్యాపకులుగా పనిచేశారు. టీనాచౌదరికి బంగారు నంది అవార్డుపై మా-ఏపీ వ్యవస్థాపకుడు, సినీదర్శకుడు దిలీప్‌రాజా, దర్శకుడు అచ్చన శ్రీనివాస్‌యాదవ్, నటులు మిలటరీ ప్రసాద్, అమీర్ చౌద్రి తదితరులు అభినందనలు తెలియజేశారు.



అవార్డుతో టీనా చౌదరికి సత్కారం

అద్భుతం.. అబ్బురం

- ఆకట్టుకున్న గుంటూరు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- వినూత్న ప్రాజెక్టులతో వచ్చిన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: చిన్నారులు మేధకు పదును పెట్టారు. వినూత్న ఆలోచనలతో సాంకేతికను అందిపుచ్చుకున్నారు. చిట్టి బుర్రల్లో మెదిలిన ఉన్నత ఆలోచనలకు వేదిక చేసుకున్నారు. శాస్త్ర, సాంకేతిక, పర్యావరణ, సామాజిక రంగాల నుంచి వైవిధ్యమైన ప్రాజెక్టులకు రూపకల్పన చేశారు. పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన వేదికైంది. జిల్లా స్థాయి ఎగ్జిబిషన్‌లో 54 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ప్రదర్శనను డీఈఓ పి.శైలజ తిలకించారు. విద్యార్థులతో పాటు గైడ్ టీచర్లను అభినందించారు. విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు పరిశీలిస్తే...

ప్రాజెక్టు పేరు: విక్రమ్ ల్యాండర్

విద్యార్థి పేరు: జి. ప్రవీణ్, 8వ తరగతి, జెడ్పీ హైస్కూల్, తాడేపల్లి

ప్రధానాంశం: అంతరిక్ష పరిశోధన రంగంలో భారతదేశాన్ని ప్రపంచ దేశాల సరసన నిలిపిన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్టు చంద్రయాన్-3లో ఉంచిన విక్రమ్ ల్యాండర్ పనితీరును వివరించడం ప్రాజెక్టు ముఖ్యాంశం. చంద్రునిపై ల్యాండ్ అయిన విక్రమ్ ల్యాండర్ రోవర్‌లో నుంచి బయటకు వచ్చే విధానం, రోబోను వివరిస్తూ ఆసక్తి కరంగా ఉంది. తక్కువ ఖర్చుతోనే దీనికి రూపకల్పన చేశారు. విక్రమ్ ల్యాండర్ కదలికలను కళ్లకు కట్టినట్లుగా చూపారు.



ప్రాజెక్టు పేరు: అబ్‌స్టాకెల్ అవోయిడింగ్ లైన్ ఫాలో రోబో

విద్యార్థి పేరు: ఎం.నాగ వైష్ణవి, 9వ తరగతి, జెడ్పీ హైస్కూల్, కొర్నెపాడు



ప్రధానంశం: సెన్సార్ సిస్టమ్‌తో పని చేసే ఈ రోబోను రియల్ టైంలో అందుబాటులోకి తీసుకువస్తే ట్రాఫిక్ నిబంధనలు పాటించే విధంగా నియంత్రించడం. భారీ పరిశ్రమల్లో రోజువారీ కార్యకలాపాల్లో మానవ తప్పిదాలతో వాటిల్లే భారీ నష్టం, ప్రమాదాలను నివారించడం. లైన్ ఫాలోయర్ రోబోట్‌లో సెన్సార్‌ల నుంచి సమాచారాన్ని ప్రాసెస్ చేసి, దాని కదలికను నిర్దేశించే నియంత్రణ వ్యవస్థ మైక్రో కంట్రోలర్, సెన్సార్ డేటాను అర్థం చేసుకుని, రూపొందించడానికి ప్రోగ్రామ్ చేయబడిన గణన పరికరాన్ని కలిగి ఉంటుంది. తద్వారా రోబోట్ వేగాన్ని తిప్పడం, ఆపడం, సర్దుబాటు చేయడం వంటివి నిర్ణయించడానికి నియంత్రణ వ్యవస్థ ఉంటుంది.

ప్రాజెక్టు పేరు: స్మార్ట్ కార్ థెఫ్ట్ అలారం

విద్యార్థి పేరు: షేక్ ఆషిర్, పదో తరగతి, జెడ్పీ హైస్కూల్, లాం, గుంటూరు



ప్రధానంశం: కార్లను వినియోగించేవారికి ఉపయోగపడే పరికరం ఇది. పార్కింగ్ చేసిన కారును చోరీ కాకుండా నివారించేందుకు ఉపయోగం. ఇందులో పవర్ సర్క్యూట్‌తో పాటు ఐఆర్ సెన్సార్, బజర్, రిలే ఉన్నాయి. సెంట్రల్ లాకింగ్ వ్యవస్థ ఉన్న కార్లను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో దొంగిలిస్తున్న నేపథ్యంలో వాటిని నిరోధించేందుకు వినూత్నమైన ఆలోచనకు కార్యరూపం ఇచ్చారు. ఐఆర్ సెన్సార్‌ను కారులో అమర్చడం ద్వారా కారు డోర్లు ఓపెన్ చేసినా, ముందుకు నడిపేందుకు ప్రయత్నించినా కారు యజమాని వద్ద ఉండే బజర్ మోగుతుంది. తక్షణమే అప్రమత్తం కావడం ద్వారా కారును చోరీకి గురి కాకుండా నివారించవచ్చు.

ప్రాజెక్టు పేరు: ఉమెన్ ప్రొటెక్షన్

విద్యార్థినులు: డి.వజ్ర సంజన, ఎండీ అర్షియాబేగం, 9వ తరగతి, శ్రీశారదా నికేతన్ గర్ల్స్ హైస్కూల్, గుంటూరు



ప్రధానాంశం: విద్యార్థినులు, మహిళల ఆత్మరక్షణకు ఉపయోగపడే పరికరాలకు రూపకల్పన చేశారు. ఒంటరిగా ప్రయాణించే సమయంలో ఆగంతకుల నుంచి తమను తాము రక్షించుకునేందుకు విద్యుత్ చార్జింగ్‌తో పని చేసే స్టెన్‌గన్ ఉపయోగపడుతుంది. ఆగంతకుల నుంచి తప్పించుకునే క్రమంలో స్టెన్‌గన్‌ను వారిపై ప్రయోగించడం ద్వారా విద్యుత్ షాక్ తగులుతుంది. దీంతో పాటు లేజర్ లైట్ సెక్యూరిటీ అలారం, రిస్ట్ బ్యాండ్, దిశ యాప్ ద్వారా మహిళలకు రక్షణ అందించే విధానాలను విద్యార్థినులు తమ ప్రయోగం ద్వారా వివరించారు.

క్లుప్తంగా

ప్రముఖ కవి 'సోమేపల్లి'కి ఘన నివాళి



పాత గుంటూరు: కవిగా, గుంటూరు జిల్లా రచయితల సంఘం, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం వ్యవస్థాపక అధ్యక్షులుగా సోమేపల్లి వెంకట సుబ్బయ్య సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఎస్వీయన్ కాలనీలోని చిన్మయ ఫంక్షన్ హాలులో ఆదివారం సోమేపల్లి వెంకట సుబ్బయ్య సంస్మరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సోమేపల్లి వారి 'చేను చెక్కిన శిల్పాలు' హిందీ అనువాద పుస్తకాన్ని నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, డాక్టర్ వెన్నా వల్లభరావు ఆవిష్కరించారు. చలపాక ప్రకాష్ రచించిన 'అప్పగింతలు ' కథా సంపుటిని పాపినేని శివశంకర్, పెనుగొండ లక్ష్మీనారాయణ, చిల్లర భవానీదేవి ఆవిష్కరించి సోమేపల్లికి అంకితమిచ్చారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు భూసురుపల్లి వెంకటేశ్వర్లు, బీరం సుందరరావు, గుమ్మా సాంబశివరావు, రావెల సాంబశివరావు, కందిమళ్ల సాంబశివరావు, కోసూరి రవికుమార్, వి. నాగరాజ్యలక్ష్మి, మోదుగుల రవికృష్ణ, ఆచార్య ఎన్. వి.కృష్ణారావు, సీహెచ్. మస్తానయ్య, నూతలపాటి తిరుపతయ్య, తూములూరి రాజేంద్రప్రసాద్, వల్లూరి శివప్రసాద్, రావి రంగారావు, కొండా శివరామిరెడ్డి, సయ్యద్ జానీ బాషా, తదితరులు సభలో పాల్గొన్నారు. సోమేపల్లితో తమకున్న సాహితీ స్మృతుల్ని నెమరు వేసుకున్నారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించి, రెండు నిమిషాల మౌనం పాటించారు. కార్యక్రమాన్ని శ్రీ వశిష్ఠ, శ్రీ విశ్వనాథ విరించి, తోటకూర వెంకట నారాయణ, మానుకొండ ఉపేంద్ర, చలపాక ప్రకాష్ నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి సాహితీవేత్తలు, సోమేపల్లి బంధు మిత్రులు పాల్గొన్నారు. రెవెన్యూ, జిల్లా పరిషత్ అధికార అనధికారులు పాల్గొని, విధి నిర్వహణలో ఆయన నీతి, నిజాయతీ, క్రమశిక్షణ ఆదర్శప్రాయమని కొనియాడారు.

జిల్లావ్యాప్తంగా పటిష్ట బందోబస్తు

నగరంపాలెం: శాంతి, సమాధానం సుగుణాలుగా కలిగిన ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని జిల్లా ఎస్పీ కె. ఆరిఫ్‌హఫీజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ప్రజలకు ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా జిల్లావ్యాప్తంగా అన్ని చర్చిల వద్ద, ముఖ్యమైన ప్రదేశాలలో పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజలంతా పోలీసులకు సహకరించాలని, క్రిస్మస్ పండుగను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని ఆయన సూచించారు.

శరవేగంగా దీక్ష విరమణ ఏర్పాట్లు

- తుది దశకు క్యూలైన్ పనులు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో జనవరి 3 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే భవానీ దీక్ష విరమణ మహోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి. వినాయకుడి గుడి వద్ద నుంచి ప్రారంభమైన క్యూలైన్ల ఏర్పాటు దాదాపు పూర్తయింది. కనకదుర్గనగర్‌లో ప్రసాదం కౌంటర్ల కోసం క్యూలైన్లు ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. లక్ష్మీ గణపతి ప్రాంగణంలో షెడ్డు నిర్మాణం, మహా మండపం దిగువన హోమ గుండాల పనులు జరుగుతున్నాయి. రెండు, మూడు రోజుల్లో హోమగుండాల నిర్మాణం పూర్తవుతుందని ఆలయ ఇంజినీరింగ్ అధికారులు పేర్కొంటున్నారు. సీతమ్మ వారి పాదాల వద్ద భవానీలు తలనీలాలు సమర్పించడానికి కేశ ఖండనశాల షెడ్డు, స్నాన ఘాట్లలో జల్లు స్నానాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. దీక్ష విరమణలపై ఆలయ ఈవో కె.ఎస్.రామారావు ఇంజిరింగ్ అధికారులతో సమీక్షిస్తున్నారు. దేవస్థాన చైర్మన్ కర్నాటి రాంబాబు పనులు నెలాఖరుకు పూర్తి కావాలని సూచిస్తున్నారు. వీరితోపాటు కలెక్టర్ ఢిల్లీరావు, సీపీ టీకే రాణా ప్రత్యేక దృష్టి పెట్టారు.

రేపు గిరిప్రదక్షిణ

పౌర్ణమి పురస్కరించుకుని డిసెంబర్ 26వ తేదీన ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఈవో కె.ఎస్.రామారావు పేర్కొన్నారు. లోక కల్యాణార్థం, భక్తజన శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రతి పౌర్ణమి రోజు శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి కొండ చుట్టూ గిరి ప్రదక్షిణ నిర్వహించడం ఆనవాయితీ. మంగళవారం తెల్లవారుజామున 5.55 గంటలకు ఘాట్ రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం నుంచి గిరి ప్రదక్షిణ ప్రారంభం కానుంది. కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితారా, కబేళా, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, నెహ్రూబొమ్మ సెంటర్, బ్రాహ్మణ వీధి మీదగా మహా మండపానికి ఊరేగింపు చేరుకుంటుంది. దీనిలో భవానీలు, అయ్యప్పలు, శివ దీక్షాపరులతో పాటు అమ్మవారి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని ఆలయ అధికారులు కోరారు.

శ్రీలక్ష్మీ నిదానంపాటి అమ్మవారి ఆలయాభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ప్రభుత్వ విప్ పీఆర్కే
- రూ. 13కోట్లతో పనులకు శ్రీకారం
- రాజగోపుర శిలా ఫలకం ప్రారంభం



శిలా ఫలకాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ పీఆర్కే

దుర్గి: రాష్ట్ర ప్రభుత్వం, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ నిదానంపాటి అమ్మవారి ఆలయంలో రూ. 13 కోట్లతో వివిధ అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ. 2.50కోట్లతో ఐదు అంతస్తుల గాలిగోపుర నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. భక్తుల వసతి కోసం 10 కాటేజీలను ప్రారంభించారు. సీసీ రోడ్డు, మినరల్ వాటర్ ప్లాంట్, ప్రధాన రహదారిలో కల్వర్టులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత నాలుగున్నరేళ్లలో ఆలయ అభివృద్ధికి ఎంతో కృషి చేసి, ప్రముఖ దేవాలయాల్లో నిలిపినట్లు తెలిపారు. అమ్మవారిని దర్శించుకునేందుకు లక్షలాది మంది భక్తులు వస్తున్నారని, రద్దీని దృష్టిలో ఉంచుకొని మాస్టర్ ప్లాన్ రూపొందిస్తున్నామని వెల్లడించారు. ప్రైవేటు కంపెనీలతో ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారు. ఆలయ ఈవో శిరిగిరిరాజు నరసింహబాబు మాట్లాడుతూ మాస్టర్ ప్లాన్‌ను త్వరితగతిన అమలు పర్చేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. షాపింగ్ కాంప్లెక్స్, విడిది గృహాలతో పాటు ఆలయ అభివృద్ధికి అనేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, ఎంపీపీ ఏసూరి సాయి శంకర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి, మాచర్ల మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యరబోతుల శ్రీనివాసరావు, కన్వీనర్ ఉన్నం పెద్దబ్బాయ్, మున్సిపల్ మాజీ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు కటకం చిన వెంకటయ్య, నాలి రామయ్య నలబోతు చిన్నబ్బాయ్, యకటీల బుచ్చిబాబు, జక్కా రమేష్, మమ్ము శివరాం, జంగా యలమంద, శెట్టిపల్లి కోటేశ్వరరావు, తోటకూర నాగేశ్వరరావు, పసుపులేటి వెంకట్రామయ్య, గొంది నాసరయ్య, జంగా కొండలు, సిబ్బంది గుండాల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

దాచేపల్లిలో 1,320 ఇళ్ల పట్టాల పంపిణీ



ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

దాచేపల్లి : స్థానిక నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీలో 1,320మంది పేదలకు ప్రభుత్వం ఇళ్ల పట్టాలు మంజూరు చేసింది. కాలనీలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్. జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని తెలిపారు. మంచి పనులు చేసే ప్రభుత్వానికి మహిళలు అండగా ఉండాలని ఆయన కోరారు. టీడీపీ నాయకుల మాటలకు మోసపోవద్దని సూచించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తనకు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, మాజీ చైర్మన్ మునగా పున్నారావు, జెడ్పీటీసీ సభ్యుడు మూలగొండ్ల ప్రకాష్‌రెడ్డి, ఎంపీపీ కటకం జయశ్రీ , వైస్ చైర్మన్లు షేక్ ఖాదర్‌బాషా, కొమెరబత్తిన విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీలు కందుల జాను, తండా అబ్దుల్ సత్తార్, పార్టీ పట్టణ, మండల శాఖ అధ్యక్షులు షేక్ సుభాని, కోట కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాకీర్ హుస్సేన్, కౌన్సిలర్లు చాట్ల క్రాంతికుమార్, శ్రీరాం పోలు, నాగుబండి గురువులు, దేవళ్ల లక్ష్మీప్రసన్న, వందనపు వెంకట్రామయ్య, మందపాటి వీరారెడ్డి, ఈదా వెంకటరెడ్డి, యార్డు డైరెక్టర్లు బుగ్గల జానీ, యర్రంశెట్టి సైదారావు, మాజీ సర్పంచ్ బుర్రి విజయ్‌కుమార్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మునగా నిమ్మయ్య, సొసైటీ అధ్యక్షుడు బత్తుల లింగారెడ్డి, కొప్పుల రవికుమార్, కొప్పుల రామకృష్ణ, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు వంగా పద్మావతి, మైనార్టీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ సైదా, మండల, పట్టణ శాఖ మైనార్టీ సెల్ అధ్యక్షులు సయ్యద్ మౌలాలీ, షేక్ సైదా, తహసీల్దార్ జి.కరుణకుమార్, కమిషనర్ వి. సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రా ఐకమత్యానికి ప్రతీక

గుంటూరు వెస్ట్: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంతో స్నేహభావం, ఐకమత్యం పెంపొందుతాయని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్ వద్ద ఆదివారం ఉదయం ప్రారంభమైన ఆడుదాం ఆంధ్రా 2 కి.మీ. వాక్‌థాన్‌ను నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు కలసి జెండా ఊపి ప్రారంభించారు. వాక్‌థాన్‌ను మార్కెట్ సెంటర్ వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నల్లపాడు లయోలా స్కూల్ మైదానంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సుమారు 45 రోజుల పాటు నిర్వహించనున్న క్రీడా సంబరానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇప్పటికే లక్షా 25 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. క్రికెట్, ఖోఖో, షటిల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, వాలీబాల్ మహిళలకు, పురుషులకు వేర్వేరుగా పోటీలు ఉంటాయని చెప్పారు. రాష్ట్ర స్థాయిలోని విజేతలకు ఐదు లక్షల బహుమతితో పాటు జిల్లా స్థాయిలోనూ అనేక బహుమతులు అందజేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరి, డీఆర్వో చంద్రశేఖరరావు, డెప్యూటీ మేయర్లు వనమా బాలవజ్రబాబు, షేక్ సజీల, ఆర్డీఓ పి.శ్రీకర్, సోషల్ వెల్ఫేర్ డీడీ మధుసూదనరావు, బీసీ కార్పొరేషన్ ఈడీ దుర్గాబాయి, డీఎస్ఏ చీఫ్ కోచ్ జి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆనంద 'నంది'నంగా నాటకోత్సవాలు



విజయవాడ సంస్కార భారతి వారి పద్య నాటకం శ్రీమాధవవర్మలో దృశ్యం



రాప్తాడు సురభి యూత్ కల్చరల్ అసోసియేషన్ వారి బాలల నాటిక బాధ్యతలో దృశ్యం



విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ హైదరాబాద్ వారి కలనేతలో దృశ్యం

- కళలు సమాజ చైతన్య దీపికలు
- రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి

పాత గుంటూరు: కళలు సమాజాన్ని చైతన్య పరచడంతో పాటు ప్రజల్ని సన్మార్గంలో నడిపేందుకు తోడ్పడతాయని రాష్ట్ర చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి పేర్కొన్నారు. గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో సంస్థ ఆధ్వర్యంలో నంది నాటకోత్సవాలు–2022 ఉత్సాహభరితంగా సాగుతున్నాయి. రెండో రోజు ఆదివారం రెండు నాటకాలు, మూడు నాటికలు ప్రదర్శితమయ్యాయి. అన్నీ వినోదంతో పాటు విజ్ఞానాన్ని పంచి, జనరంజకంగా సాగాయి. సురభి వారి రంగాలంకరణలు ప్రదర్శనలకు వన్నె తెచ్చాయి. కళాకారులు ప్రతిభను చాటారు. సందేశాలు నేరుగా హృదయాలకు చేరేలా ప్రదర్శనలుండటంతో ప్రేక్షకులు ఏకాగ్రతతో తిలకించారు.

- ప్రదర్శనలలో తొలిగా శ్రీ మాధవ వర్మ (పద్య నాటకం) ప్రదర్శితమైంది. ఇది భక్తుల కొంగు బంగారంగా ప్రసిద్ధికెక్కిన విజయవాడ కనకదుర్గమ్మ చరిత్ర కావడంతో అందరూ ఎంతో ఆసక్తిగా చూసి ఆనందించారు.
- 'బాధ్యత' నాటిక రెండో ప్రదర్శనగా ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇది బాలల నాటిక. పర్యావరణ పరిరక్షణ నేపథ్యంలో చిచ్చర పిడుగులలాంటి బాలలు నటనా కౌశలాన్ని ప్రదర్శించి ప్రశంసలందుకున్నారు.
- మూడో ప్రదర్శన 'కలనేత' నాటకం. నేతన్నల జీవితాల నేపథ్యంలో కుటుంబాల నడుమ బంధాలు, అనుబంధాల విలువల్ని యువత ఆలోచిస్తూ ముందడుగేస్తున్న తీరును నాటకం చూపించింది.
- 'చీకటిపువ్వు' నాటిక చక్కని సందేశాన్ని అందించింది. పరిస్థితులకి ఏ మనిషీ అతీతంకాదని, అవసరంతోనో అవకాశం లేకో చాలామంది జీవితంలో తప్పులు చెయ్యడం సహజమని తెలిపింది. కానీ చేసిన తప్పులు తెలుసుకొని పశ్చాత్తపడిన తర్వాత కూడా అలాంటి వారిని దూరం పెట్టకూడదని సందేశాత్మకంగా నాటకం సాగింది.

ఆదర్శవంత ప్రదర్శన 'ఉద్ధమ్ సింగ్'

స్వాతంత్ర్య సంగ్రామంలో భరతమాత బానిస సంకెళ్లు తెంచడానికి పోరాటం చేసిన వీరులు ఎందరో ఉన్నారు. వారిలో ఉరికంబాన్ని ముద్దాడి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన ఉద్ధమ్ సింగ్ ఆదర్శ జీవితాన్ని నాటిక చక్కగా చూపించింది.

నేటి ప్రదర్శనలు ఇవే..

- ఉదయం 9:30 గంటల నుంచి కడప సవేరా ఆర్ట్స్ నిర్వహణలో వల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచన, ఆళ్లూరి వెంకటయ్య దర్శకత్వంలో శ్రీ రామ పాదుకలు (పద్య నాటకం)
- మధ్యాహ్నం 12:30 నుంచి విజయవాడ శ్రీ రామ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ నిర్వహణలో డాక్టర్ పి.వి.ఎన్ కృష్ణ రచనకు, పి. సాయిశంకర్ దర్శకత్వంలో మంచి గుణపాఠం (బాలల నాటిక)
- మధ్యాహ్నం 2 గంటల నుంచి తెనాలి కళల కాణాచి నిర్వహణలో డాక్టర్ ఎం.ఎస్. చౌదరి రచన, దర్శకత్వంలో జనక్ పాయల్ బాజే (సాంఘిక నాటకం)
- సాయంత్రం 4:30 నుంచి విశాఖపట్నం తెలుగు కళా సమితి నిర్వహణలో పి.టి. మాధవ్ రచన, చలసాని కృష్ణ ప్రసాద్ దర్శకత్వంలో నిశ్శబ్దమా నీ ఖరీదెంత ? (సాంఘిక నాటిక)
- సాయంత్రం 6 గంటల నుంచి అనంతపూర్ ఎస్ఎస్‌బీఎన్ డిగ్రీ కళాశాల నిర్వహణలో ఆముదాల సుబ్రహ్మణ్యం రచన, దర్శకత్వంలో ఇంకెన్నాళ్లు ? (కళాశాల, విశ్వవిద్యాలయాల నాటిక)
- రాత్రి 7:30 నుంచి గుంటూరు సద్గురు కళానిలయం నిర్వహణలో విద్యాధర్ మునిపల్లి రచనకు, బసవరాజు జయశంకర్ దర్శకత్వంలో కమనీయం (సాంఘిక నాటిక)
- రాత్రి 9:00 నుంచి తాడేపల్లి అరవింద ఆర్ట్స్ నిర్వహణలో వల్లూరు శివప్రసాద్ రచనకు గంగోత్రి సాయి దర్శకత్వంలో జరుగుతున్న కథ (సాంఘిక నాటిక)

కళాకారుల బృందానికి నగదు ప్రోత్సాహకాలు

శ్రీ మాధవ వర్మ పద్యనాటకం కళాకారుల బృందానికి రూ. 50 వేలు నగదు, ప్రశంసాపత్రాన్ని సంస్థ చైర్మన్ పోసాని కృష్ణ మురళి అందజేశారు. కలనేత నాటిక బృందానికి రూ. 40 వేలు, బాధ్యత బాలల నాటిక కళాకారుల బృందానికి రూ. 25 వేలు,చీకటి పువ్వు నాటిక కళాకారులకు రూ. 25 వేలు, ఉద్ధమ్ సింగ్ నాటిక కళాకారుల బృందానికి రూ. 25 వేలు, త్రిజుడు నాటిక కళాకారుల బృందానికి రూ. 25 వేలు, గమ్యస్థానాల వైపు కళాకారుల బృందానికి రూ.25 వేలు, మెమెంటో, ప్రశంసా పత్రాలు అందించారు.

దుర్గమ్మ సన్నిధిలో భక్తుల రద్దీ



ఆలయ ప్రాంగణంలో అమ్మవారి ఉత్సవ మూర్తికి పూజలు



మాస్కులు ధరించి అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు

- తెలంగాణ, కర్ణాటక నుంచి భారీగా భక్తులు రాక
- రూ.500 టికెట్ దర్శనానికి గంటన్నర సమయం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రికి ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. వరస సెలవుల నేపథ్యంలో ఆదివారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు భక్తుల రద్దీ కొనసాగుతూనే ఉంది. తెలంగాణ, కర్ణాటక నుంచి భారీగా భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీకి తోడు ఆది దంపతులకు నిర్వహించిన పలు ఆర్జిత సేవల్లో ఉభయదాతలు విశేషంగా పాల్గొన్నారు. దీంతో ఆలయ ప్రాంగణంలో భక్తుల తాకిడి కనిపించింది. ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీ చక్రనవార్చన, శాంతి కల్యాణం, చండీ హోమంతో పాటు పలు సేవల్లో భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రాజగోపురం వద్ద సూర్యోపాసన సేవ నిర్వహించారు. ఆయా సేవల్లో పాల్గొన్న ఉభయదాతలకు ప్రత్యేక క్యూలైన్ మార్గం ద్వారా అమ్మవారి దర్శనానికి అనుమతించారు. సర్వ దర్శనం క్యూలైన్‌లో అమ్మవారి దర్శనానికి రెండున్నర గంటల సమయం పడితే, రూ. 500 టికెట్ క్యూలైన్‌లో గంటన్నర సమయం పట్టింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు భక్తులతో అన్ని క్యూలైన్లు కిటకిటలాడాయి. సాయంత్రం అమ్మవారి పంచహారతుల సేవ, పల్లకీ సేవలో ఉభయదాతలు పాల్గొన్నారు.

అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి యాక్షన్ ప్లాన్



వినయ్‌సాగర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): కృష్ణానదిలో సహజసిద్ధంగా ఏర్పడి దేశంలోనే ప్రసిద్ధిగాంచిన భవానీద్వీపానికి పూర్వవైభవం తీసుకువచ్చి, పర్యాటకంగా అభివృద్ధి చేస్తానని భవానీ ఐలాండ్ టూరిజం కార్పొరేషన్ (బీఐటీసీ) వైస్ చైర్మన్ గుర్రంకొండ వినయ్‌సాగర్ ఆదివారం 'సాక్షి'కి తెలిపారు. ప్రభుత్వ సహకారంతో భవానీ ద్వీపాన్ని మరింత అభివృద్ధి చేస్తానన్నారు.భవానీ ఐలాండ్‌లో అడ్వెంచర్ టూరిజానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు వివరించారు. ఏపీ పర్యాటకశాఖకు పెద్ద అసెట్‌గా ఉన్న భవానీ ద్వీపాన్ని కాపాడుకోవల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గతంలో అడ్వెంచర్ టూరిజం అభివృద్ధికి వివిధ రాష్ట్రాలకు సలహాదారుగా చేయూతనిచ్చిన అనుభవంతో రాష్ట్రంలో అడ్వెంచర్ టూరిజాన్ని అభివృద్ధి చేసేందుకు యాక్షన్ ప్లాన్‌ను రూపొందించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమర్పించినట్లు చెప్పారు. యాక్షన్ ప్లాన్‌లో భాగంగా వాటర్ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్, వైఎస్సార్ అడ్వెంచర్ స్పోర్ట్స్ ఇనిస్టిట్యూట్, అడ్వెంచర్ స్పోర్ట్స్ ప్రొడక్ట్స్ మేన్యుఫ్యాక్చరింగ్ హబ్, సేఫ్టీ మానిటరింగ్ గ్రిడ్, అడ్వెంచర్ ప్రొడక్ట్స్ ప్రొటో టైపింగ్ ల్యాబ్, మాస్టర్స్ ఇన్ ఇండస్ట్రియల్ మేన్యుఫ్యాక్చరింగ్ (అడ్వెంచర్ ప్రొడక్ట్స్) వంటి అనేక ప్రతిపాదనలను సిద్ధం చేసినట్లు చెప్పారు. తాను తయారుచేసిన ప్రతిపాదనలు ఇచ్చిన ఆరునెలల తరువాత కేంద్ర ప్రభుత్వం కూడా అదే ప్రతిపాదనలకు సమానంగా 'నేషనల్ స్ట్రాటజీ ఫర్ అడ్వెంచర్ టూరిజం' అనే గైడ్‌లైన్స్‌ను విడుదల చేయడం విశేషమన్నారు. అందులోభాగంగా మనరాష్ట్రం ఒక నోడల్ ఏజెన్సీని తయారు చేసుకుంటే కేంద్రం నిధులు విడుదల చేస్తామని ప్రకటించడం గమనార్హమన్నారు. దేశంలో సరైన సేఫ్టీ రెగ్యులేషన్లు, అవగాహన, ప్రత్యేక శ్రద్ధ లేనందున ఆ మార్కెట్‌ను క్యాష్ చేసుకోలేకపోతున్నామని తెలిపారు. తన ఆలోచనలను కార్యరూపంలోకి తీసుకువచ్చి అడ్వెంచర్ టూరిజం ద్వారా నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని వినయ్‌సాగర్ వివరించారు.

మంత్రి అంబటి క్రిస్మస్ శుభాకాంక్షలు

సత్తెనపల్లి: క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రజలందరికీ రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ సాటి మనుషులపై ప్రేమ, నిస్సహాయులపై కరుణ, శత్రువులపై క్షమ, ఆకాశమంతటి సహనం, అవధుల్లేని త్యాగం, శాంతియుత జీవనం.. ఇవన్నీ తన జీవితం ద్వారా మానవాళికి క్రీస్తు ఇచ్చిన మహోన్నత సందేశాలని పేర్కొన్నారు. క్రీస్తు బోధనలు ఎప్పటికీ సన్మార్గంలో నడిపిస్తాయన్నారు. రాష్ట్ర ప్రజలందరికీ మంచి జరిగేలా ఎల్లప్పుడూ క్రీస్తు ఆశీస్సులు మెండుగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

కలెక్టర్ క్రిస్మస్ శుభాకాంక్షలు

నరసరావుపేట: జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి ప్రజలకు ఆదివారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. క్రైస్తవులంతా వేడుకలను ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు. త్యాగం, ప్రేమ, కరుణ గొప్పతనాన్ని ఏసుక్రీస్తు తన బోధనలు ద్వారా విశ్వ మానవాళికి తెలియచేశారని వివరించారు. క్రీస్తు అనుసరించిన మార్గం ఎంతో ఆదర్శనీయమని సూచించారు. యేసుక్రీస్తు ప్రపంచ సర్వమత శాంతి స్థాపనకు పుట్టిన మహనీయుడు, గొప్ప శాంతి దూతని పేర్కొన్నారు. శత్రువులను సైతం క్షమించమని చెప్పిన కరుణామూర్తి ఏసుక్రీస్తుగా తెలిపారు. ఆయన చూపిన శాంతి మార్గంలో పయనించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

క్రీస్తు మార్గం అనుసరణీయం

జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: పల్నాడు జిల్లా ప్రజలందరికీ జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి శనివారం క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. శాంతి, సమాధానాలు సుగుణాలుగా కలిగియున్న క్రీస్తు మార్గం అనుసరణీయమని ఆయన సూచించారు. పండుగను కుటుంబ సభ్యులతో ఆనందంతో జరుపుకోవాలనిఆకాంక్షించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా పోలీస్ అధికారులు, సిబ్బందితో అన్ని చర్చిలు, ముఖ్యమైన ప్రదేశాల్లో బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రజలంతా పోలీసులకు సహకరించి పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛగా జరుపుకోవాలని ఆయన సూచించారు.